క్లుప్తంగా

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలి



ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మణికంఠ, రాజునేత

కాచిగూడ: ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మణికంఠ, రాజు నేత, రామ్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను వారు ఎండీకి వివరించారు. జిల్లాలకు, వివిధ గ్రామాలకు బస్సు సర్వీసులను నడపాలని కోరారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేశం

కాచిగూడ: సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ ప్రధాన కార్యదర్శిగా మల్లం వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేకు గురువారం ఆ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతిలు ఆయనకు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలో వెంకటేశం మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్, ఎన్ దిలీప్ రావు, గోపీనాథ్ కట్టికోల, సావోజు శృతి తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో ప్రమాదకర చెట్ల కొమ్మలు తొలగించాలి



మౌలానా ఆజాద్‌నగర్ బస్తీలో పర్యటించి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: బస్తీల్లో ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి అధికారులకు సూచించారు. గురువారం డివిజన్‌లోని మౌలానా ఆజాద్‌నగర్ బస్తీలో జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏడి నాగేశ్వర్‌రావు, జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్‌లతో కలిసి ఆమె పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీ దావఖాన వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాలని, బస్తీలో నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. వర్షపు నీరు, కచ్చా మోరీల మ్యాన్‌హోల్స్ రిపేర్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్, వాసు, శ్రీకాంత్, సతీష్, రంజిత్, రామకృష్ణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

కవితావిక సంపుటి ఆవిష్కరణ



సంపుటిని ఆవిష్కరిస్తున్న రేలంగి నరసింహారావు

చిక్కడపల్లి: వ్యవస్థలో మార్పులు రావాలంటే కవులు, రచయితలు ప్రజల్లో సామాజిక ఆలోచనలు కలిగించేలా రచనలు చేయాలని ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత తిరుమల వెంకటస్వామి రచించిన 'కవితావిక కవితాసంపుటి ఆవిష్కరణ'కార్యక్రమం గురువారం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మధుజ్యోతి, రఘుశ్రీ, భవాని, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

10న లక్ష్మి ఉప్పలమ్మ బోనాలు

చిక్కడపల్లి: జవహర్‌నగర్‌లోని శ్రీలక్ష్మి ఉప్పలమ్మ దేవాలయంలో శ్రావణమాస బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ అధ్యక్షుడు వై.సంజీవరెడ్డి, కోశాధికారి పవన్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం వారు మాట్లాడుతూ... ఈనెల 10వ తేదీన జరిగే బోనాల ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు హాజరవుతారని అన్నారు.

మార్కెట్ రోడ్డు అధ్వానం

- పరిశీలించిన కార్పొరేటర్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం
- అనుమతులు, నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం: అధికారులు
- నూతన రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలి: కార్పొరేటర్ అమృత

నల్లకుంట: నల్లకుంట వెజిటబుల్ మార్కెట్ రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారింది. కొన్నేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని సంబందిత శాఖ అధికారులకు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ సమస్యను స్థానికులు కార్పొరేటర్ అమృత దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ గురువారం జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ పృథ్వీ, వర్క్ఇన్‌స్పెక్టర్ నరేందర్‌తో కలిసి మార్కెట్ రోడ్డును పరిశీలించారు.



అధికారులతో కలిసి మార్కెట్ రోడ్డులో పర్యటిస్తున్న కార్పొరేటర్

☛ శంకరమఠం మార్కెట్ చౌరస్తా నుంచి నాగమయ్యకుంట నాలా స్టార్ట్ పాయింట్ వరకు రోడ్డును పరిశీలించారు. అదే విధంగా ఎంత వరకు సీసీ రోడ్డు వేయాలనే దానిపై కొలతలు తీసుకున్నారు. నూతన సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూపొందించిన నివేదికను జీహెచ్ఎంసీ క్వాలిటీ కంట్రోల్ విభాగానికి పంపిస్తామని డీఈ ప్రవీణ్ చెప్పారు.



జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ పృథ్వీ, వర్క్ఇన్‌స్పెక్టర్ నరేందర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్

☛ ఆ తర్వాత క్వాలిటీ కంట్రోల్ అధికారులు వచ్చి మరోమారు ఈ రోడ్డును పరిశీలించి ఇక్కడ బీటీ రోడ్డు నిర్మించాలా? సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలా? రోడ్డు నిర్మాణానికి అనుకూలంగా ఉందా? లేదా? అని పరిశీలిస్తారని చెప్పారు. ఆ తర్వాత అందుకు సంబంధించిన వివరాలతో కూడిన అంచనా నివేదికను తమకు అందిస్తారని తెలిపారు.

☛ ఆ అంచనా నివేదిక ఆధారంగా రోడ్డు నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు తయారు చేసి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు పంపిస్తామని చెప్పారు. జోనల్ కమిషనర్ నుంచి అనుమతులు వచ్చి, నిధులు మంజూరు కాగానే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని డీఈ వివరించారు.

☛ మార్కెట్ రోడ్డు స్థానంలో త్వరితగతిన నూతన రోడ్డు నిర్మించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను కార్పొరేటర్ అమృత కోరారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనదారులు, పాదచారులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.1.5 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు.

అసంపూర్తిగా నాలా పై కప్పు నిర్మాణం

- నాలాలో పేరుకుపోతున్న వ్యర్థాలు
- ప్రమాదాన్ని గుర్తించి పై కప్పు నిర్మించాలని డిమాండ్

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని గోల్నాక చౌరస్తా నుంచి చే నంబర్ ఫ్లై ఓవర్‌కు వెళ్లే దారి వెంట బాక్స్ నాలా పై కప్పును నిర్మించారు. అయితే కొంత మేర నాలా పై కప్పును నిర్మించకుండా వదిలేశారు. దీంతో వ్యర్థాలు, చెత్తాచెదారం అందులో పేరుకుపోయింది. వర్షం పడి రోడ్డుపై నీరు నిలిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. నాలా కచ్చా మోరీపై శ్లాబ పూర్తి స్థాయిలో నిర్మించకుండా కొంత మేర వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నాలాలోని మట్టి, చెత్తాచెదార్ని తొలగించి పై కప్పును నిర్మించాలని కోరుతున్నారు.



ప్రజావసరాలకు అనుగుణంగా పునర్‌నిర్మిస్తాం

- గాంధీనగర్ కార్పొరేటర్ పావని
- నిధులున్నా పనులు చేపట్టకపోవడం పై ఆగ్రహం



కమ్యూనిటీహాల్‌లో అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ పునర్ నిర్మాణానికి రూ.26లక్షల నిధులు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సహకారంతో మంజూరయ్యాయని గాంధీనగర్ కార్పొరేటర్ పావని పేర్కొన్నారు. అయినా పనులు ప్రారంభించకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణంలో గురువారం కమిటీ సభ్యులు, డీఎంసీ రామానుజులరెడ్డి, డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలాంతో పనులపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... స్థానికులు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుగుణంగా పునర్ నిర్మిస్తామని అన్నారు. దీనిపై అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత వినయ్‌కుమార్, స్థానికులు గుండు సురేందర్, మహేందర్, ఎం.కృష్ణ, జగదీష్, దినేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేతివృత్తులను కాపాడాలి

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చేతి వృత్తిని, చేనేత కార్మికులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో నూలు, రంగులు, వడ్డీలేని రుణాలు ఇవ్వాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాంనగర్‌లోని తన నివాసంలో కొండా లక్ష్మణబాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత వీవింగ్, డిజైనింగ్ నిపుణులు గజం అంజయ్య, తెలంగాణ ప్రభుత్వ రాజముద్ర రూపశిల్పి ఏలే లక్ష్మణ్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింద మల్లేషం, తెలంగాణ ప్రభుత్వ అవార్డు గ్రహీత కందిగంట్ల నర్సింహా, వీవింగ్ డిజైన్‌లో రాష్ట్ర పతి అవార్డు గ్రహీత ఖాండిగట్ల బాలమణిని ఆయన సత్కరించారు. అనంతరం



చేనేత ప్రముఖులను సత్కరిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వారంలో రెండు రోజులు చేనేత దుస్తులు ధరించాలన్నారు. తద్వారా చేనేత కార్మికులకు చేయూతనిచ్చినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వన్నాల శ్రీరాములు, పాశం యాదగిరి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శంకర్ (ఫైల్)

నల్లకుంట: ఇంట్లో ఎవరితో చెప్పకుండా వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలు.. అవివాహితుడైన జీహెచ్ఎంసీ కార్మికుడు ఎస్.శంకర్(41) నల్లకుంట నర్సింహ బస్తీలో మరో సోదరుడితో కలిసి ఉంటున్నాడు. గత నెల 29న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిన శంకర్ తిరిగి రాలేదు. ఈసీఐఎల్‌లో నివాసముండే అతడి సోదరి జి. యాదమ్మ ఎప్పటి లాగే నర్సింహబస్తీలో నివాసముండే మరో సోదరుడి భార్యకు ఫోన్ చేయగా శంకర్ గత నెల 29న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదని చెప్పింది. వెంటనే శంకర్‌కు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల ఇంటికి వెళ్లాడనుకున్న ఆమె వస్తాడులే అని నాలుగు రోజులు వేచి చూసింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన యాదమ్మ తమ సోదరుడు కనిపించడంలేదంటూ గురువారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాచిగూడ: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పురలోని అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న రాములమ్మ (60) గత నెల 24వ తేదీన మెట్లను శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి గాయాలపాలైంది. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణంపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

కవాడిగూడ: తాళ్లబస్తీలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి భవనం నిర్మించిన యాజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికుడు చంద్రప్రకాష్ గురువారం హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ నిబంధనలు పాటించకుండా అనధికారికంగా భవనం నిర్మించారని పేర్కొన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని భవన యజమానికి చెబితే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కమిషనర్‌కు తెలిపారు.

'మాకు ప్రాణహాని ఉంది'

చిక్కడపల్లి: నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని డాక్టర్ శంకర్ పీపుల్స్ హాస్పిటల్ ఎండీ డా. శంకర్ అతడి అనుచరుల నుంచి తమకు ప్రాణహాని ఉందని.. తమకు రక్షణ కల్పించాలని పట్టాభి టవర్స్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డాక్టర్ శంకర్స్ తప్పుడు పర్మిషన్ తీసుకొని హాస్పిటల్ నిర్మించారన్నారు. దీనిపై తాము జీహెచ్ఎంసీఏకి ఫిర్యాదు చేశామన్నారు. వారు హాస్పటల్ భవనాన్ని కొద్ది రోజుల క్రితం సీజ్ చేశారని చెప్పారు. దీనిని మనసులో పెట్టుకుని ఫిర్యాదు వెనుక్కు తీసుకోవాలని బెదిరిస్తున్నారని తెలిపారు. పోలీసులు న్యాయం చేయకపోతే న్యాయపరంగా వెళ్తామని చెప్పారు.

'కాంగ్రెస్, బీజేపీ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు'

కవాడిగూడ: బీసీలకు 42 శాతం రిజనర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీజేపీలు దొంగ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. ఇప్పటికైనా బీసీలకు ఈ రెండు పార్టీలు మోసం చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ధర్నాపై తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్‌గాంధీ, ఖర్గే, సోనియాగాంధీ ఇలాంటి నేతలు ఎవరూ ధర్నాకు హాజరు కాకపోవడంపై బీసీల పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏంటో అర్ధమవుతోందని అన్నారు. కాంగ్రెస్ ఎంపీలు సోషల్‌మీడియాలో కాకుండా పార్లమెంట్‌లో గళం విప్పాలన్నారు. అనంతరం మాజీ అధ్యక్షులు బుర్రా రాముగౌడ్ మాట్లాడుతూ... బీసీలకు 42



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్

శాతం రిజర్వేషన్లలో ముస్లిం రిజర్వేషన్లు పెంచే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం సరికాదన్నారు. పార్లమెంట్‌లో చర్చించి బీసీ రిజర్వేషన్ అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రెండు పార్టీల ఎంపీలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ మల్లంగి, హేమ జిల్లాజు, శివాజీ, నాయకులు పాల్గొన్నారు.

కార్మిక పోరాటాలపై నిర్బంధాలు మానుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కార్మిక పోరాటాలపై నిర్బంధం, ఆంక్షలను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐటీయూ నేతలు ఎస్వీ రమ, జె.వెంకటేష్, వంగూరు రాములుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి ప్రజలు, కార్మికులు, రైతులు, ఉద్యమకారులు భయపడాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిస్తూ నియంతృత్వ వైఖరిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. మధ్యాహ్న భోజన కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ధర్నాకు పిలుపునిస్తే కార్మికులను అరెస్టు చేసి నిర్బంధాలు, ఆంక్షలు విధించడాన్ని ఖండించారు. నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. ఈ విషయాల్లో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. కార్మికవర్గ పోరాటాల పట్ల వ్యవహరిస్తున్న తీరు ప్రభుత్వం మార్చుకోవాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్బంధాన్ని ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

'రేజంగ్లా కలశయాత్ర'ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎడ్ల హరిబాబుయాదవ్

ముషీరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న యాదవ కులస్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు బిహార్ రాష్ట్రం నుంచి ప్రారంభమైన రేజంగ్లా కలశయాత్ర ఈ నెల 9వ తేదీన రాష్ట్రంలోని నారాయణపేట్ మండలం నుంచి ప్రారంభమవుతుందని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ తెలిపారు. గురువారం ముషీరాబాద్‌లోని యాదవ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేజంగ్లా కలశయాత్ర రాష్ట్రంలోని వివిధ జిల్లాలో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈనెల 16న నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌హాల్‌లో భారీ బహిరంగ సభ, కలశయాత్ర పూజలు, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. ఇండో – చైనా యుద్ధంలో 114 మంది యాదవులు అమరులయ్యారని పేర్కొన్నారు. యాదవుల పోరాట పటిమను గుర్తించేందుకు భారత సైన్యంలో అరుదైన గుర్తింపు కోసం ఆయూర్(యాదవ్) రేంజ్‌మెంట్‌ను ప్రవేశపెట్టే విధంగా పార్లమెంట్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. 40 ఏళ్లుగా భారత సైన్యంలో ఆయూర్ రేంజ్‌మెంట్‌ను ప్రవేశపెట్టాలని పోరాటం చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే రేజంగ్లా కలశయాత్రను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యాత్రలో పెద్ద ఎత్తున యాదవ కులస్తులు పాల్గొనాలని కోరారు. యాత్ర ముగింపు సభ రాష్ట్రంలోని సిరిపుర్ కాగజ్ నగరంలో ఉంటుందన్నారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్‌యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, ముఖ్య సలహాదారులు బి.బాబురావుయాదవ్ పాల్గొన్నారు.

'రాజకీయ పార్టీలు బీసీలను మోసగిస్తున్నాయి'

ముషీరాబాద్: రిజర్వేషన్లు పెంచుతామని సాధ్యం కానీ హామీలు ఇస్తూ బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసగిస్తున్నాయని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదని తెలిసి కూడా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు వంత పాడటం వారి దివాళాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. రాజకీయ పార్టీలు బీసీలతో చేసే రాజకీయ జిమ్మిక్కుల వలన స్థానిక సంస్థలలో ఉన్న బీసీ రిజర్వేషన్లకు కూడా నష్టంవాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రాజకీయ పార్టీలకు బీసీలపై నిజంగా చితశుద్ధి ఉంటే అన్ని పార్టీలు పార్టీల పరంగా రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే బీసీలపై ప్రేమ ఉంటే తాము అనుభవిస్తున్న అత్యున్నత పదవులకు రాజీనామా చేసి బీసీలకు అప్పగించే ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు.

మనిషి జీవితంలో మానవత్వం కీలకం

చిక్కడపల్లి: మనిషి జీవితంలో మానవత్వం కీలకమని మల్కాజిగిరి కోర్టు జడ్జి బాషానవాజ్ ఖాన్ అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత నిర్వహించిన తెలుగు, హిందీ, సినీ సంగీత విభావరి ఆలరించింది. ఈ కార్యక్రమంలో



ప్రముఖులు ఉమర్‌ఖాన్, వెంకట్రావు, భాస్కర్ గుప్తా, రఘు, ఖాజావలి, నిర్మలాప్రభాకర్, వల్లీ శర్మ, రాధారాణి, శివానిరెడ్డి, లంకా లక్ష్మీనారాయణ, లోకం కృష్ణయ్య, మోహనకృష్ణ, లలితా రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ముషీరాబాద్: రాంనగర్‌లోని శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహా సుదర్శన హోమం, అభిషేకం, అన్నదానం, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల హరిబాబుయాదవ్, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, సదా, శ్రీధర్‌చారి, ముచ్చకుర్తి ప్రభాకర్, వీరేష్, రామకృష్ణ, నాయకులు అశోక్‌చారి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సభలు

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల 8వ తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సభలు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ డా. ప్రభు అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్యఅతిథులుగా ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య డీఎస్ఆర్ రాజేంద్ర సింగ్, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఆచార్య ఎస్‌కే మహమ్మద్, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపకుడు ఆచార్య జి.వెంకటరాజం, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆచార్య జి.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... 1960 దశకంలోనే శ్రీవివేకానందుడి పేరుతో ఇక్కడ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి లక్షల మందికి విద్యను అందించిందన్నారు. చరిత్రాత్మకమైన తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు ఇక్కడ నిర్వహించడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. అన్ని వసతులు ఈ కళాశాలలో ఉన్నాయని అన్నారు. భవిష్యత్‌లోనూ ఇలాంటి సమావేశాలకు అతిథ్యం ఇస్తామని తెలిపారు. డా. రాజేంద్రసింగ్ మాట్లాడుతూ... ఇంత పెద్ద కార్యక్రమం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ఈ సమావేశాలకు కాలేజియేట్ ఎడ్యుకేషన్ నుంచి తగిన ప్రోత్సాహం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేశ్వర్, కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డా. లావణ్య, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ఆఫీస్ బేరర్స్ ఆచార్య సుధారాణి, ఆచార్య బి.లావణ్య, అంకం జయప్రకాష్, టి.మనోహర్, జి.దయాకర్, డాక్టర్ బండి శ్రీనివాస్, ఐ.లక్ష్మి, ధనీష్‌మోయిన్, వందనం శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్త, సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు